ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

బుధవారం 12 జూన్ 2024



200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత 5లో..

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా 6లో..



బడికి వేళాయె

- కొనసాగుతున్న బడిబాట
- పాఠశాలలకు చేరుకున్న పుస్తకాలు, యూనిఫారాలు
- పాఠశాలల్లో కానరాని స్వీపర్లు
- అస్తవ్యస్తంగా పరిసరాలు
- ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలు ఫీజులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బడికి వేళయింది.. యాభై రోజుల వేసవి సెలవుల అనంతరం బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులందరూ ఆటపాటలతో గడపగా, బుధవారం నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పాఠశాల ప్రారంభం నాటికి ఎండలు తగ్గి వాతావరణం చల్లబడాల్సి ఉండగా.. మరింత మండుతుండడంతో పాఠశాలలకు పంపేది ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటిలాగే ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాలో 358 ప్రాథమిక పాఠశాలలు, 83 ప్రాథమికో ఉన్నత పాఠశాలలు, 14జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 10 కస్తూర్బా బాలికల విద్యాలయాలు, 7 మోడల్ స్కూళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల విద్యాలయాలతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 95,731 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మరమ్మతు పనులు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు 50వేల నుంచి 1,50,000 వరకు నిధులు మంజూరుచేయడంతో పనులు కొనసాగుతున్నాయి.

● కొనసాగుతున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ..

గత ఏడాది అక్టోబరులో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మూడు రోజుల నుంచి బదిలీ చేపడుతున్నారు. అక్టోబరులో గెజిటెడ్ హెచ్ఎం గ్రేడ్-1 ఉపాధ్యాయుల బదిలీలు పూర్తికాగా, అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను బదిలీ చేసినప్పటికీ వాళ్ల ఆయా పాఠశాలల నుంచి రిలీవ్ కాలేదు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించే విషయమై కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో అవి నిలిచిపోయాయి.ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తికావడంతో ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ వెంటనే స్కూల్ అసిస్టెంట్లను ఇటీవల ఆయా పాఠశాల నుంచి రిలీజ్ చేశారు. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులను గ్రేడ్ వన్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో వాళ్లు ఆయా పాఠశాలలకు బదిలీకానున్నారు. పదోన్నతి అనంతరం ఈనెల 22వ తేదీలోపు ఎస్జీటీలను కూడా బదిలీ చేయనున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు రానున్నారు.

● ప్రభుత్వ పాఠశాలలో కానరాని స్వీపర్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్ పోస్టులు తీవ్రంగా కొరత ఉన్నాయి. జిల్లాలో ఉన్న పాఠశాలల్లో కనీసం 10 మంది కూడా లేకపోవడం గమనార్హం. వారి స్థానంలో కనీసం ప్రభుత్వం పేపర్లను కూడా నియమించడం లేదు. దీంతో పాఠశాలల్లో పారిశుధ్యం పేరుకుపోతున్నది. తరగతి గదిలో నీళ్ల పెట్టడం, తరగతి గదులను ఊడ్చడం, పరిసరాలను శుభ్రంగా ఉంచేవాళ్ల లేకపోవడంతో పరిసరాలు బాగాలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బడి గంట కొట్టేవాళ్ల కూడా లేకపోవడంతో ఒక్కోసారి ఉపాధ్యాయులు, విద్యార్థులు కొడుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే స్పందించి అటెండర్ల స్థానంలో కనీసం స్కావెంజర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● 19వరకు బడి బాట..

ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ డ్రాప్స్ విద్యార్థు లను కలిసి వారికి విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు రప్పిం చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పించే వసతుల గురించి వారికి వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 19వ తేదీ వరకు జరగనున్నది. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు మండల కేంద్రా లకు చేరుకున్నాయి. పుస్తకాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం ఎమ్మార్సీ భవనాల నుంచి తరలించారు.

● ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలు ఫీజులు..

ప్రతియేటా ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు అడ్డగోలు ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులపై తీరని భారాన్ని మోపుతున్నారు. ఇవేకాకుండా అడ్మిషన్ ఫీజులు, యూనిఫారంలు, టై, బెల్టులు, షూలు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పాఠశాలల్లోనే విక్రయిస్తూ అదనపు లాభాలను ఆర్జిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు..



రామగిరి ఎమ్మార్సీ భవనంలో ఉన్న నోట్ బుక్కులు



కాల్వశ్రీరాంపూర్ పాఠశాలలో యూనిఫాంలను పంపిణీ

ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్కులు, రెండు జతల యూనిఫాంలు ఇస్తున్నారు. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలన్నీ జిల్లాకు చేరుకున్నాయి. అప్పన్నపేటలో ఉన్న గోదాం నుంచి మండల కేంద్రాలకు పంపించారు. అక్కడినుంచి పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తీసుకువెళ్తున్నారు. యూని ఫారాలు సైతం పాఠశాలలకు చేరాయి. ఇప్పటికే పలు పాఠశాలలో విద్యార్థులకు యూనిఫారాలను పంపిణీ చేస్తున్నారు. బుధవారం పాఠశాలలో ప్రారంభం కాగానే విద్యార్థులకు యూనిఫారంతో పాటు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.

గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరించండి

- ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయండి

- మంత్రి పొన్నంను కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూన్ 11: కరీంనగర్ రీజియన్‌లోనే అత్యధికంగా ఆదాయం తీసుకువస్తున్న గోదావరిఖని బస్టాండ్‌ను ఆధునికీకరించాలని మంగళవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వినతి పత్రం అందజేశారు. సెక్రటేరియేట్‌లో మంత్రికి పలు సమస్యలపై విన్నవించారు. గోదావరిఖని బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుందని, జనాభాకు అనుగుణంగా సౌకర్యవంతంగా ఉండేందుకు మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దాలని, అంతేకాకుండా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మెట్రో నగరాలకు, గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే కొంత ఆదాయం వస్తుందని, దీనిపై దృష్టిపెట్టాలని మంత్రిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మోడల్ బస్టాండ్‌గా గోదావరిఖనిని తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం హామి ఇచ్చారు.

బీసీ సంక్షేమ భవనానికి రూ.35కోట్లు

రామగుండం నియోజకవర్గంలో బీసీ సంక్షేమ భవనం ఏర్పాటుకు రూ.35కోట్లు ఇవ్వడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని, త్వరలోనే భవన నిర్మాణ పనులు చేపడుతామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. బీసీ సంక్షేమ భవనానికి రూ.35కోట్లు అవుతాయని, వాటికి మంజూరు ఇప్పించాలని కోరగా దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ బీసీ సంక్షేమ భవనం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు మక్కాన్‌సింగ్ చెప్పారు.

నేడు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన

పెద్దపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడి అర్హత కలిగిన వారు తమ సర్వీస్ బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల12న బుధవారం ఉదయం 10గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ఆలయ భూముల కౌలుకు వేలంపాట

ఓదెల, జూన్ 11 : మండలంలోని దేవదాయ ధర్మదాయ శాఖ ఆలయాల భూముల కౌలు కోసం 13న, గురువారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. ఓదెలలోని సీతారామచంద్రస్వామి, చీకటితోట ఆంజనేయస్వామి, అలాగే పొత్కపల్లి రాజగోపాల స్వామి ఆలయాల పరిధిలో ఉన్న దాదాపు 30ఎకరాల భూములను రైతులకు కౌలుకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో కౌలు అర్హత పొందిన రైతులు ఈనెల 13 నుంచి 2025 మే వరకు కౌలు సాగు చేసుకునేందుకు హక్కు ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు ఖుష్కి రూ.30వేలు, తరికి రూ.10వేలు ధరావత్తు సొమ్మును చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ నిబంధనల మేరకు రైతులు కౌలు సాగు చేసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణతో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 11: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రొడక్టివిటీ కౌన్సిల్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత ఉపాధి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ప్రాజెక్ట్ లీడర్ రాజేంద్ర అన్నారు. మంగళవారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖలో నమోదైన కార్మికుల పిల్లలకు ఉచితంగా కేరిర్ గైడెన్స్, రెస్యూమ్ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ఇన్‌చార్జి రాజేంద్ర, ఎపీపీసీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ప్రకాష్‌లు హాజరై పలు సూచనలు చేశారు. భవన నిర్మాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో 41 రకాల కంప్యూటర్ కోర్సులను, యాప్ ద్వారా ఉచితంగా శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. అనంతరం 238మంది విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఇన్‌చార్జి రాజేంద్ర, ప్రకాష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

పెద్దపల్లిటౌన్, జూన్ 11: ఐటీఐలో ప్రవేశాలకు ఈనెల 14 వరకు దరఖాస్తు తేది పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఏ.నర్సింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలలో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు పొడిగించినట్లు అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐటీఐ తెలంగాణ.గోవ్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ ఆప్షన్లు ఎంచుకోవాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

మంథని, జూన్ 11: పలు బాధిత కుటుంబాలను జడ్పీ చైర్మన్ పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. స్థానిక ఎరుకలగూడెంలో అనారోగ్యంతో మృతిచెందిన సుతారి శ్రీవత్సవ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. మంథని మాజీ ఏఎంసీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి హైదరాబాద్‌లో మృతిచెందగా పుట్ట మధు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. గోదావరిఖనిలో ఇటీవల మృతిచెందిన దొంతుల లింగం మృతిచెందగా అతడి కుటుంబాన్ని, అటికేటి ప్రవళికకు ఆపరేషన్ కాగా పరామర్శించారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరందించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జూన్ 11 : చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామంలోని మ్యాదరి కండి చెరువు నిర్మాణ ప్రగతి పనులను ఆయన పరిశీలించారు. ధర్మపురి నియోజకర్గంలోని రైతులు సాగు చేసుకుంటున్న చివరి ఆయకట్టుకు సాగు, తాగు నీరందించే విషయంలో గతంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించానని, సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. అదేవిధంగా ధర్మారం మండలం పత్తిపాక రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న కొత్తపల్లి మ్యాదరి కండి చెరువు నిర్మాణానికి గత ప్రభుత్వ రూ.16కోట్లు మంజూరుచేయగా అందులో రూ.6కోట్ల వరకు పనులు చేశారని అధికారులు నివేదించారని ఆయన తెలిపారు. ఈ చెరువు కింద దాదాపు 185నుంచి 200 ఎకరాలకు సాగు నీరంది మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్, మ్యాదరికండిచెరువు నిర్మాణాల మిగులు పనుల కోసం నిధులు మంజూరుకు సీఎం రెవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి వివరిస్తానని ఆయన చెప్పారు. త్వరలోనే ధర్మపురి రోళ్లవాగు పనులను పూర్తిచేసి ధర్మపురి రైతాంగానికి సాగు నీరందిస్తామని తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ రజిత తదితరులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. స్పందించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు.

జేఎన్టీయూలో సాంకేతిక ఫెస్ట్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

రామగిరి, జూన్ 11: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆవిష్కృత్ సాంకేతిక ఫెస్ట్‌ని మంగళవారం ప్రారంభించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన సాంకేతిక ఫెస్ట్‌ని కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే సాంకేతిక ఫెస్ట్‌కి కళాశాల సర్వాంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఈవెంట్స్‌లో విద్యార్థులు ఉత్సాహం పాల్గొన్నారు. వివిధ అంశాలపై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ఈఈఈ విభాగాధిపతి దుర్గారావ్ వ్యవహరిస్తుండగా, ఈ కార్యక్రమంలో మైనింగ్ విభాగాధిపతి శర్మ, డీఈఈ సతీష్, ఆఫీసు సూపరింటెండ్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలనాధికారి సుమాన్, అధ్యాపకులు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

- విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా చూడాలి - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖన్

పెద్దపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధి చెందేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళి కాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యా యులు,ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి వివరించాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే కనీసం పది శాతం అదనంగా విద్యార్థుల ఎన్‌రోల్మెంట్ పెరగాలని సూచించారు. ప్రతి గ్రామంలో పాఠశాలల్లో చేరిన విద్యార్థుల జాబితా నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రైవేటు పాఠశాలకు పంపడానికి గల కారణాలు తెలుసుకోవాలని, ఆ వివరాలతో ప్రత్యేకంగా నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు టీచర్స్ విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధ వహించాలని హెడ్‌మాస్టర్‌లకు సూచించారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని, ప్రతిరోజు పాఠశాలలో టీచర్స్ హాజరుపై నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరు కాని విద్యార్థులకు సంబం ధించి జాబితా రూపొందించి వారు హాజరు కాకపోవడానికి గల సమస్యలు తెలుసుకొని, వీలైనంత వరకు పరిష్కరించి విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు తెలుసుకునేందుకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రమాణాల ఆధారంగా వారిని 3 భాగాలుగా విభజించాలని, వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా ప్రత్యేక విద్యాబోధన పద్ధతులను పాటించాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలలో సైతం విద్యార్థులను ప్రోత్సహించాలని, దీనికోసం ప్రత్యేకంగా మన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజు తప్పనిసరిగా ఒక స్పోర్ట్స్ పీరియడ్ ఏర్పాటుచేయాలని, దీనికి అవసరమైన సామగ్రి, ఇతర ఏర్పాట్ల అంశంలో జిల్లా యంత్రాంగం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుందన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పీఈటీలకు కొన్ని పాఠశాలల బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని, పీఈటీలు సదరు పాఠశాలల పరిధిలోని విద్యార్థుల హైట్, వెయిట్, ఫిట్ నెస్ అంశాలకు సంబంధించి ప్రాథమిక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని, మధ్యాహ్న భోజన నాణ్యత అంశంలో ఎక్కడా రాజీపడవద్దన్నారు. పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ నుంచి అవసరమైన విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు పున: ప్రారంభం నుండి లంచ్ అండ్ లెర్న్ బుధవారం కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించడం జరుగుతుందని, మధ్యాహ్నం భోజనం నాణ్యత అంశంలో ఎక్కడైనా చిన్న పొరపాటు జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం షేక్, ప్రధాన ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

అదనపు కలెక్టర్ అరుణశ్రీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిటౌన్, జూన్ 11: నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జూన్ 20న జిల్లాలో ఉన్న 1నుంచి 19 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సంబంధిత అధికారులు సూచించారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జే.అరుణశ్రీ మాట్లాడుతూ, నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటితో రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతా యని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చన్నారు. నులి పురుగుల నియంత్రణ కీలకమైన అంశమని, దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహ రించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. జూన్ 20న జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 2లక్షల 27వేల 251 మందికి అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2లక్షల 49వేల 976నులి పురుగుల నివారణ మాత్రలను అందుబాటులో ఉంచుకున్నామని, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. 20న అనారోగ్య, ఇతర కారణాల వల్ల మాత్రలు వేసుకోని విద్యార్థులకు తప్పనిసరిగా 27న అందించాలని సూచించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను అరుణశ్రీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.ప్రమోద్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జే. రంగారెడ్డి, షెడ్యూల్ తరగతుల సంక్షేమ అధికారి నాగలేశ్వర్, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వసంత

జమ్మికుంట, జూన్ 11: మహిళల ఆరోగ్య సంరక్షణకు మెనుస్ట్రువల్ కప్‌లను వాడాలని బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దోవారి వసంత అన్నారు. జమ్మికుంటలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఆమెజాన్ వారి ఆర్థిక సహాయంతో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మెనుస్ట్రువల్ కప్‌ల ఉపయోగం, వ్యక్తి గత పరిశుభ్రతపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 150మంది మహిళలకు మెనుస్ట్రువల్ కప్స్‌ను అందజేశారు. అనంతరం దోవారి వసంత మాట్లాడుతూ మానవ మనుగడను శాసించే ఓ సహజ ప్రక్రియ రుతుస్రావం అన్నారు. మహిళలు బాగుంటనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మహిళలు నెలసరి సమయంలో ప్యాడ్స్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్‌తో పాటు రక రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ప్యాడ్స్ భూమిలో కరుగడానికి అనేక సంవత్సరాలు పడుతుందని, ఒకవేల కాల్చితే పర్యవరణ సమస్య తలెత్తుతుందని చెప్పారు. మెనుస్ట్రువల్ కప్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. మహిళల ఆరోగ్యం, డబ్బు, పర్యావరణ పరిరక్షణ, సౌక ర్యం, ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకొని మెనుస్ట్రువల్ కప్స్‌ను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కో-ఆర్డినేటర్ కె సుమలత, ఎ స్వాతి, శాస్త్రవేత్త ప్రశాంతి పాల్గొన్నారు.

మోటార్ల విద్యుత్ తీగల చోరీ

మల్యాల, జూన్ 11: మండలంలోని వరదకాలువకు రైతులు అమ ర్చుకున్న పంప్‌మోటార్ల విద్యుత్ తీగలు కొన్ని రోజులుగా చోరీకి గురవు తున్నాయి. రాంపూర్ నుంచి సర్వాపూర్ శివారుల వరకు వందలాదిగా పంప్‌మోటార్లను అమర్చుకొని రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల సాగు పనులు ప్రారంభం కాగా రెండు రోజులుగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం నుంచి సర్వాపూర్ వరకు గల పంప్‌మోటార్ల విద్యుత్ తీగలను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళుతున్నట్లు రైతులు తెలిపారు. గతంలోనూ నూకపల్లి శివారులో విద్యుత్‌తీగలు, పంప్‌మో టార్లలోని కాపర్ తీగలు కూడా చోరీకి గురి కాగ అప్పట్లో కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల మళ్లీ పెరుగడంతో ఆందోళన చెందుతున్నారు.

గంజాయి కాల్చివేత



గంజాయిని తగులబెడుతున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 11: సిరిసిల్ల పట్టణం రగుడు శివారులోని డంప్ యార్డు వద్ద జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 36 కిలోల 436 గ్రాముల గంజాయిని కాల్చివేశారు. మంగళవారం రగుడు డంప్‌యార్డువద్దకు జిల్లా వ్యాప్తంగా 41 కేసులలో స్వాధీన పరుచుకున్న 36.436 కిలోల నిషేధిత గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో కాల్చేసి బూడిద చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మ త్తు పదార్థాలను రవాణాచేసే వారిపై పీడీ యాక్ట్ అమలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖ ర్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 275క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఒక క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 4,500 రూపాయలు చెల్లించారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, జూన్ 11: ఆరెపల్లిలో సోమ వారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరె పల్లికి చెందిన మంజెడి రాజయ్య తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.15 వేల నగదు, టీవీ, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన నడిగొట్ల లింగయ్యకు చెందిన సెల్‌ఫోన్‌ను, నడిగొట్ల శ్రీనివాస్‌కు చెందిన నీటి పంపును దొంగతనం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, జూన్ 11: సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలో బేడబుడిగె జంగాల కాలనీలోని ఒకరి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి ఉన్న రెండు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వానరాసి నంబయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారన్న సమాచారం మేరకు అధికారులు దేవునిపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా బియ్యం సేకరించే వారు, బుడిగె జంగాల కాలనీ వాసులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సివిల్ సప్లై అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని అధికారులకు రక్షణ కల్పించారు. దాంతో అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని కొనసాగించారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అట్టి బియ్యాన్ని సుల్తానాబాద్ లోని ఎం ఎల్ ఎస్ పాయింట్ గోదాముకు తరలించారు. ఈ దాడుల్లో జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దారులు శంకర్ , రవీందర్ రాథోడ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్‌లో..

సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట గ్రామం నుంచి అక్రమంగా ట్రాలీలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ పట్టుకొన్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంట వెంకటేష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం ట్రాలీలో రేషన్ బియ్యం తీసుకొని వెళ్తడగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసీ వెంకటేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆరోగ్యం హెచ్చరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టివేత

▸▸ మంథని, మద్దులపల్లికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు ▸▸ వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని, జూన్ 11: గంజాయి మత్తుకు బానిసై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయిని క్రమంగా రవాణా చేస్తూ, గట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగిస్తున్న ఇద్దరు యువలకును మంథని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆదేశాల మేరకు.. మంథని బస్ డిపో వద్ద మంథని ఎస్‌ఐ వెంకటకృష్ణ, సీపీలు దుబ్బాసి రమేష్, ఐతు లుకాలు పెట్రోలింగ్ చేస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో డిపో చౌరస్తాలో ప్లాస్టిక్ బ్యాగ్‌తో సహా ఉండి అనుమానాస్పదంగా ఉన్న క్రమంలో యువకులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ద్వారా పంచానామా నిర్వహించి బ్యాగ్‌లో ఉన్న గంజాయిని తూకం వేయించగా 1కిలో 70 గ్రాములు ఉండగా దాని విలువ రూ.26,750 ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును మంథని పోలీసులు విచారించగా మంథనికి చెందని పుల్లె ప్రశాంత్, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మద్దెలపల్లికి చెందిన చికినారపు సంతోష్‌లను నిందితులుగా తేలిందన్నారు. వీరి పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. యువత మత్తు కోసం గంజాయి, మద్యం లాంటి వాటికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకొవ ద్దన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కదలిక పై దృష్టి సారించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై స్థానిక పోలీసులకు లేదా 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభను కనబర్చిన మంథని ఎస్‌ఐ వెంకటకృష్ణ, పీసీలు దుబ్బాసి రమేష్, ఐతు లూకాలను గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

వరి కొయ్యలు కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని వృద్ధుడి మృతి


భూమయ్య(ఫైల్)

రాయికల్, జూన్ 11: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని ఓ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాయికల్ పట్టణానికి చెందిన రైతు తోపారపు నడిపి భూమయ్య(70) సోమవారం సాయంత్రం తన పంట పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. వరి కొయ్యలకు నిప్పు పెట్టి అక్కడే ఉండగా కొయ్యలు కాలుతూ ప్రమాదవశాత్తు వృద్ధుడికి అంటుకోవడంతో శరీరం పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన భూమయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

పరస్పర దాడులు.. నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని రాజన్నపేట గ్రామానికి చెందిన నమిలికొండ బాలయ్య నమిలికొండ రాజవ్వ, నమిలికొండ పర్శయ్య, నమిలికొండ నిర్మల ఒకరిపై ఒకరు దాడులకు ఎగబడ్డారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకునేందుకు యత్నించారు. ఎంత చెప్పినా వినకపోవడంతోపాటు రహదారిపై వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ కాత్యాయనీదేవి వ్రతం

మెట్‌పల్లి, జూన్, 11: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి కల్యాణవ్రతాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొంగుబంగారంగా కొలిచే పెద్దమ్మ ఆలయంగా వెలి సిన బంగారు పెద్దమ్మ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వ్రతాలను ఆలయంలో చేపట్టారు. ఉదయం నుంచి బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. సర్ప దోష నివారణ, కల్యాణ, సంతాన దోషాల పరిహారం వంటి కార్యక్రమాలను చేయించారు. భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మీ, గోశాలలోని గోమాతలకు పూజలు చేశారు.


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి, జూన్ 11: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ బోనాలు గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఆలయంలోని అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. బోనాల జాతరకు మెట్‌పల్లి చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణలు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు బోనం ఎత్తుకుని పట్టణంలోని చావిడి వద్ద ఉన్న భూమాత ఆలయం నుంచి డప్పు చప్పులతో శివసత్తుల పూనకంలో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే భక్తులతో కలిసి బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. జాతరలో గౌడ శెట్టి, పంబాల పూజారుల ఎల్లమ్మ వేషధారణ, పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, పూదారి నర్సాగౌడ్, చెర్లపల్లి మీనా, చెర్లపల్లి సుఖేందర్‌గౌడ్, ఎనుగందుల శ్రీనివాస్, వనజ, చెర్లపల్లిలక్ష్మీ, రాజేశ్వర్‌గౌడ్, పుల్ల చిన్నయ్యగౌడ్, పూదరి శ్యాంసుందర్‌గౌడ్, పూదరి రామ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఏనుగందుల గోపిగౌడ్, భక్తులు, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల మధ్య బోనాలతో మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బోనాలు నెత్తిన పెట్టుకోని గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడికి చేరుకోని బోనాలు, ఒడి బియ్యాన్ని సమర్పించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పైడిపల్లి ఆనందం, కౌన్సిలర్ బొంగోని వీరన్న, అయోధ్య, బుర్ర సంపత్, పైడిపల్లి మల్లిఖార్జున్, పొన్నం వెంకటరమణ, పైడిపల్లి పెద్ద భీమయ్య, బొంగోని సదానందం, పైడిపల్లి తిరుపతి, గట్టు సదయ్య, పంజాల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.


మెట్‌పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన కొండగట్టు

- ఇబ్బందులు కలుగకుండా అధికారుల చర్యలు


ఆలయ ఆవరణలో భక్తజనం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడంకు బారులు తీరగా అంజన్నను దర్శించు కొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనంకు గంట సేపు పైగా సమయం పట్టింది. విద్యార్థుల వేసవి సెలవులు ముగుస్తుండ డం తో తరలివచ్చిన భక్తులు అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముడిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. వై జంక్షన్ వద్ద వాహనాలతో భక్తుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. భక్తులు వచ్చిన వాహనాలతో ఘాట్‌రోడ్డు నిండిపోయింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుంది

-పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్



మాట్లాడుతున్న పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11: క్రీడలతో దేహదారుఢ్యం, శారీరక పటుత్వం లభిస్తాయని ఫిజికల్ ఎడ్యుకేషనల్ కమాన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీసెట్) కన్వీనర్ రాజేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మంగళవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు శారీరక పరీక్షలను రెండో రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. 470మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం హాజరైన అభ్యర్థులకు వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్‌లతో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్ రావు, శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ నిజాముద్దీన్ మునవర్, శాతవాహన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పీడీలు శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, బాలరాజు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో యువకుడి హఠాన్మరణం


వినయ్‌కుమార్(ఫైల్)

వేములవాడ టౌన్, జూన్ 11 : కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చి న ఓ యువకుడు తీవ్ర ఒత్తిడికి లోనైన హఠన్మారణం పొందిన సంఘటన వేములవాడ పట్టణంలో మంగళవారం విషాదాన్ని నింపింది. జనగామ జిల్లాకు చెందిన బొట్ల ఇస్తారి, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. పెద్ద కుమారుడి కూతురి పుట్టు వెంట్రుకలు తీసి రాజన్నను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం చిన్న కుమారుడు బొట్ల వినయ్‌కుమార్(24)కు ఛాతిలో నొప్పిగా ఉండడంతో గదిలోనే ఉంచి కుటుంబ సభ్యులు బద్ది పోచమ్మ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో ఛాతీలో నొప్పి కాస్త తీవ్రం కావడంతో మెడికల్ షాపునకు వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కొను గోలు చేసి వస్తుండగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినయ్ మృతి చెందినట్లు పేర్కొన్నారు.

ముడుపుల సామగ్రి వేలం

మల్యాల, జూన్ 11: కొండగట్టులో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షపరులు సమర్పించిన ముడుపుల సామగ్రికి దేవస్థానం అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మిశ్రమ బియ్యం కిలో రూ.23 చొప్పున, ఇత్తడి గంటలు కిలోకి రూ.440 చొప్పున, ఎండు కుడుకలు కిలో రూ.70చొప్పున వేలంలో పాల్గొన వారు ధర నిర్ణయించడంతో వాటిని ఖరారు చేశారు. మాలలకు రూ. 3.66లక్షలు, కొబ్బరికాయలకు రూ.60వేలు పలికినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు తదితరులు ఈ వేలం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అందని సెల్ సేవలు !

- భక్తులకు అందుబాటులో బీఎస్‌ఎన్‌ఎల్ మాత్రమే
- ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన శూన్యం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో సెల్ సేవలు భక్తులకు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్ కంపెనీలు కొండపైన సేవలు అందించకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అంజన్న దర్శనానికి గాను ఇక్కడకు నిత్యం వేలల్లో, ప్రతి మంగళ, శనివారాల్లో ఇరవై వేలకు పైగా హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. ఇక్కడ బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌వన్ తప్ప మిగితా కంపెనీల సెల్ సేవలు లేకపోవడంతో ఊసురుమంటున్నారు. కొండపైన గల బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు కూడా అంతంతమాత్రమే కాగ రద్దీ రోజుల్లో సామర్థ్యం మించిపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ రోజుల్లో ఉక్కువ మంది ప్రైవేట్ కంపెనీల సెల్‌సేవలు పొందుతుండగా ఇక్కడ వారికి సంబంధించిన ఎలాంటి సెల్‌సేవలు అందుబాటులో లేవు. దీంతో కొండపైకి వచ్చే భక్తుల సెల్‌ఫోన్‌లు ఇక్కడకు చేరుకోగానే మూగబోతున్నాయి. కొండపైన చిన్నారులు తప్పిపోయే సంఘటనలు, బంధువులు, కుటుంబసభ్యులు ఇతరాత్రా సమాచారం తెలుసుకోవడం భక్తులకు కష్టంగా మారింది.


కొండపైన ఉన్న సెల్‌వన్ టవర్

● సేవలన్నీ ఆన్‌లైన్.. సెల్ ఆఫ్‌లైన్

సెల్‌ఫోన్ ఆధారంగానే సేవలన్నీ ప్రజలుకు అందుబాటులోకి రాగ కొండపై సెల్‌సేవలు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఈ మధ్య కాలంలో డబ్బుల చెల్లింపులు, ఇతరాత్ర లావాదేవీలు అంతా సెల్‌ఫోన్ ఇంటర్‌నెట్ నుంచే జరుగుతున్నాయి. నగదు లేకుండానే అన్ని జరుగుతుండగా కొండపైన కూడా భక్తులు దుకాణాలలో వస్తువులు, పూజసామగ్రి తదితర కొనుగోళ్లలో యూపీఐ పేమెంట్స్ చేస్తుంటారు. అయితే ఇక్కడ బీఎస్‌ఎన్‌ఎల్ మినహా మిగిత సెల్ సేవలు అందుబాటులో లేకపోవడంతో డబ్బుల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో భక్తులు సెల్ సిగ్నల్స్ కోసం, చెట్లు, బండరాళ్ల ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. సెల్‌సేవలు విస్తృతంగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధి కారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలి

పాలకుర్తి,జూన్ 11: కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికలకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 15న ఎన్నికలు జరిపించాలని పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి పలువురు కార్మికులతో కలిసి మంగళవారం కంపెనీ మేనేజర్ పి పార్థసారథిని కలిసి డిమాండ్ చేశారు. ఎన్నికలు వాయిదా పడడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కంపెనీ చరిత్రలో షెడ్యూల్ ప్రకటించిన తరువాత ఎన్నికలు వాయిదా పడడం ఇది మొదటిసారి అని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు వాపోయారు. కంపెనీ మేనేజర్ పార్థసారథి మాట్లాడుతూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు, ఇందులో ఎవరి ఒత్తిళ్లు లేవని తెలిపారు. వారంలోపు ఎన్నికలు జరిపేలా కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థుల యూనిఫాం పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జూన్ 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల యూనిఫాంను మంగళవారం ఏపీఎం కనుకయ్య మండల సమైక్య భవనంలో అందజేశారు. స్వశక్తి మహిళల ద్వారా 1200 యూనిఫారంలు కుట్టినట్లు ఆయన తెలిపారు. ఎంఈవో కార్యాలయ సిబ్బందికి యూనిఫాంలను అందజేసినట్లు పేర్కొన్నారు. కుట్టిన యూనిఫారాలను సంబంధిత ప్రభుత్వ పాఠశాలల ద్వారా విదార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు తూండ్ల మౌనిక, సీసీలు శారద, నిర్మల, హరికృష్ణ, తిరుమల, కనకతార, సిబ్బంది చంద్రకళ, తాజుద్దీన్ పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటుతో మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్, జూన్ 11: ముత్తారం బస్సులో గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దరాతుపల్లి శివారులో చోటుచేసుకుంది. ముత్తారం మండలం కాశిపల్లెకు చెందిన జంగ మణమ్మ(70) మంగళవారం కాల్వశ్రీరాంపూర్‌లో తన బంధువుల ఇంటికి ఆర్టీసీ బస్సులో వస్తుండగా పెద్దరాతుపెల్లి శివారులో బస్సులోనే గుండెపోటుతో మృతిచెందింది. జంగ మణమ్మను అదే బస్సులో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

పాలకుర్తి, జూన్ 11: గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మతల్లి బోనాలను మండలం పరిధిలోని జయ్యారంలో మంగళవారం రాత్రి గౌడ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎంపీపీ దంపతులు గంగాధరి రమేష్ గౌడ్, లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం రాత్రి డప్పుచప్పుళ్లతో మహిళలు ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయంకు తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వండ్లకొండ బాపుగౌడ్, లింగగౌడ్, గాజుల ప్రసాద్‌గౌడ్, గంగాధరి గిరిగౌడ్, గంగాధరి నరేష్‌గౌడ్, వెలిచాల లింగగౌడ్, గాజుల గట్టయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

21న మాదిగశక్తి సమావేశం.

పెద్దపల్లిటౌన్, జూన్ 11: హైదారాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 21న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాదిగశక్తి సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. సమావేశంలో నిర్వహించే మాదిగశక్తి సుస్థిర లక్ష్యాల బ్రోచర్ ఆవిష్కరణ, రాష్ట్ర కమిటీ ఏర్పాటు ఉంటుందన్నారు. సమావేశానికి హాజరుకావాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీమ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును మంగళవారం హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిసి ఆహ్వానించారు. విద్యార్థులు, యువతీ యువకులు, కార్మిక, కర్షకులు, కవులు, కళాకారులు మేధావులు, వివిధ మాదిగ సంఘాల నాయకులు హాజరై మాదిగ శక్తి నిర్మాణంలో భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాలలో మాదిగల వాటా కోసం రాజ్యాంగ బద్ధంగా నిర్వచించే కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి చైర్‌పర్సన్ పరామర్శ

మంథని, జూన్ 11: స్థానిక ఎరుకలగూడెంలో అనారోగ్యంతో మృతిచెందిన సుతారి శ్రీవత్సవ పార్థివదేహాన్ని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి మంగళవారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బస్సు సర్వీసులను నడుపాలి

కమాన్‌పూర్, జూన్ 11 : మండల కేంద్రం నుంచి కరీంనగర్‌కు వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సు సర్వీసులను పెంచాలని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ మంథని డిపో మేనేజర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఈ విషయంపై మంత్రి శ్రీధర్‌బాబుకు సైతం విన్నవించినట్లు శంకర్ తెలిపారు.

యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ

మంథని, జూన్ 11: మండలంలోని అన్ని పాఠశాలలకు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని మండల విద్యాధికారి దాసరి లక్ష్మి మంగళవారం అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాల మౌలిక వసతుల పనులు వేసవి సెలవుల్లో జరిగాయన్నారు. ఈనెల 6న మొదలైన బడిబాట కార్యక్రమం 19 వరకు కొనసాగుతుందని, 12న పాఠశాల సంసిద్ధత కార్యక్రమం, 13న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలు, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న బాలిక విద్యా దినోత్సవం, 18న డిజిటలైజేషన్, మొక్కలు నాటే కార్యక్రమం, 19న స్పోర్ట్స్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎస్ కుమార్

గోదావరిఖని, జూన్ 11: రెండవ సారి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జీ కిషన్‌రెడ్డిని మంగళవారం ఢిల్లీలో బీజేపీ ఎస్సీ మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రంథాలయాలతోనే జ్ఞానం పెంపొందుతుంది

- జిల్లా గ్రంథాలయ అధికారి ఏవీఆర్ రాజు



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న రాజు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 11: గ్రంథాలయాలతోనే జ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ అధికారి ఏవీఆర్ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. పాఠకులను అడిగి గ్రంథాలయంలోని సమస్యలను తెలుసుకున్నారు. గ్రంథాలయ సమస్యల గురించి పాఠకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వాసులకు విజ్ఞానం కోసం గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థుల పోటీ పరీక్షల కోసం అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు గ్రంథాలయాలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశాల ప్రకారం గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందన్నారు. గ్రంథాలయంలో గతంలో 10గంటలకు తెరిచేది అన్నారు. పాఠకుల కోరిక మేరకు బుధవారం నుంచి ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 7గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుందన్నారు. గ్రంథా లయంలో పనిచేసే స్వీపర్‌కు కూడా జీతం పెంచేందుకు సంబంధిత పైఅధి కారుల దృష్టికి తీసుకెళతానన్నారు. నూతన గ్రంథాలయ నిర్మాణానికి ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.23 లక్షలు మంజూరు చేసిందని, పాఠకుల కోరిక మేరకు ప్రస్తుతం శిధి లావస్థలో ఉన్న గ్రంథాలయం తొలగించి కొత్తది కట్టేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు. గ్రంథాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగ నియమకాలు జరగలేదని ప్రస్తుతం లైబ్రరీయన్ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం రాష్ట్రస్థాయి అధికారులు సీఎం దృష్టికి తీసుకుపోనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గఫార్, సంపత్ సదానందం ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజనం వర్కర్లు

పెద్దపల్లిటౌన్, జూన్ 11: మధ్యాహన్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం కలెక్టర్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పూసల రమేష్ మాట్లాడుతూ నాలుగు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, మధ్యాహ్నం భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కొత్తగా కొలువుతీరిన ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగా కార్మికుల ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ మహిళా సంఘాలకు అప్పచెబుతున్నామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. వంట చేస్తున్న కార్మికులు మహిళా గ్రూపులో మహిళా సంఘాల వాళ్లేనని ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం స్వామి, గట్టయ్య వసంత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 11: పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా నుంచి కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, ఇస్రో ఆధ్వర్యంలో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.ఎం. షేక్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిఈటీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులు..



వృథాగా ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

ధర్మారం, జూన్ 11: ధర్మారం మండల కేంద్రంలో గల బీసీ కాలనీ సమీపంలోని రాష్ట్ర రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులు పగిలి తాగునీరంతా వృథాగా ప్రవహించింది. మంగళవారం ఉదయం మిషన్ భగీరథ నీరు విడుదల చేయడంతో ఇక్కడ పైపులు పగిలిపోయి తాగునీరంతా సమీపంలోగల ఊరకుంట చెరువులోకి ప్రవహించింది. మిషన్ భగీరథ పైపులు పగిలి నీరంతా వృథాగా ప్రవహిస్తోందని స్థానికులు అధికారులకు తెలియజేసిన పట్టించుకోలేదు.

ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పగిలిన పైపులను మరమ్మతులు చేయించి చర్యలు తీసుకుని తక్షణమే నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మంథని పీఏసీఎస్‌లో 3.70 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు : చైర్మన్

మంథని, జూన్ 11: ధాన్యం కొనుగోలులో మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం టాప్‌లో నిలిచి సరికొత్త రికార్డు నెలకొల్పిందని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంగళవారం వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించి అత్యధిక స్థాయిలో 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించిందన్నారు. 37ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరిపినట్లు తెలిపారు. సుమారు 4300మంది రైతుల నుంచి 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తద్వారా సహకార సంఘం ద్వారా రూ.81.36కోట్ల ధాన్యం వ్యాపారం చేశామన్నారు. రైతులను దళారుల బారినుంచి దగా పడకుండా కాపాడేందుకు గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో గ్రామగ్రామానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజూరు ఇప్పించి కల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈసారి పక్కా ప్రణాళికతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైస్‌మిల్లర్లు గతంలో క్వింటాలుకు రెండు మూడు కిలోల ధాన్యం కోత విధించేవారని, ఈసారి మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మిల్లర్లు ధాన్యంలో కోత విధించకుండా చూశామన్నారు. అందరిని సమన్వయం చేసుకుంటూ ఈసారి ప్రశాంతంగా కొనుగోళ్లు జరిపామన్నారు. సంఘం పరిధిలో నిర్వహిస్తున్న 37 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్షణ పరికరాల అందజేత

రామగిరి, జూన్ 11: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్టు కార్మికులకు కాంట్రాక్టర్ డి. తిరుపతి రక్షణ పరికరాలైన టోపి, బూట్లు, చెమ్మస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాదేంశ్రీనివాస్, వేగొలపు సంతోష్, నాయకులు రాజేశం, కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించాలి

- పెద్దపల్లి విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శన్

పెద్దపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా సైతం చెల్లించవచ్చని పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకురి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పెద్దపల్లి సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజురోజుకు గణనీయంగా పెరుగుతుందని, సాంకేతికతంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులను టీజీఎస్పీడీసీఎల్ సులభతరం చేసిందని అన్నారు. టిజిఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్, గూగుల్ పే, ఫోన్‌పే, పేటియం ద్వారా నెల వారీ విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని, గంటల తరబడి లైన్‌లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే దాని కంటే కేవలం రెండు నిమిషాల వ్యవధిలో మీ యూఎస్‌సి నెంబర్‌ను నమోదు చేసి చిటికెలో మీ బిల్లులు చెల్లింపు చేసుకోవచ్చన్నారు. మే నెలలో 54360 వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రూ.8కోట్ల 4 లక్షల 43 వేల మొత్తాన్ని చెల్లించారని, ప్రతినెల ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు 20శాతం పెరుగుతుందన్నారు. విద్యుత్ బిల్లుల కేంద్రాలకు వెళ్లకుండా కేవలం ఆండ్రాయిడ్ ఫోన్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని, తద్వారా చెల్లింపు సులభతరం అవుతుందని, కట్టిన డబ్బుల పూర్వ వివరాలు కూడా తెలుసుకోవచ్చని, రసీదు కూడా పొందటం జరుగుతుందన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లు పైనే క్యూ ఆర్ కోడ్ ను ముద్రించడం జరుగుతుందని మొదట ప్రయోగాత్మకంగా(పైలట్ ప్రాజెక్ట్)గా వరంగల్ సర్కిల్ కేంద్రంలో మట్టెవాడ ఈఆర్‌వో పరిధిలో ప్రారంభించడం జరిగిందని, త్వరలో పెద్దపల్లి సర్కిల్‌లో కూడా ప్రారంభిస్తామన్నారు. బిల్లుపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ బిల్లు తాలూక సంబంధించిన వివరాలు, చెల్లించవలసిన మొత్తం కనపడుతుందని తద్వారా వినియోగదారులు అట్టి మొత్తాన్ని చెల్లించవచ్చని అన్నారు. భవిషత్తు మొత్తం డిజిటల్ పెమెంట్స్ ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగుతుంటాయని అన్నారు. వినియోగదారులు తమ నెలవారీ విద్యుత్ బిల్లులను ఆన్ లైన్ ద్వారా చెల్లించగలరని సుదర్శన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైస్‌మిల్లు ఆపరేటర్లుకు కుదిరిన వేతన ఒప్పందం



ఒప్పంద పత్రాలను అందుకుంటున్న ఆపరేటర్ల సంఘం నాయకులు

సుల్తానాబాద్, జూన్11: సుల్తానాబాద్ రైస్‌మిల్లు ఆపరేటర్స్ యూనియన్ (సీఐటీయూ), సుల్తానాబాద్ రైస్‌మిల్లు ఓనర్స్ అసోసియేషన్ మధ్య మంగళవారం వేతన ఒప్పందం కుదిరింది. రెండు మాసాలుగా పలు దఫాలుగా జరిగిన చర్చలు ఎట్టకేలకు ఫలించాయి. ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు 2500 రూపాయలు ప్రతి ఆపరేటర్‌కు పెంచాలని, గతంలో ఉన్న బోనస్, పీఎఫ్, సర్వీస్‌పే, దుస్తులు తదితరాలు యథావిధిగా కొనసాగించాలని ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం 17మే 2024 నుంచి రెండు సంవత్సరాలు అమల్లో ఉంటుంది. ఈ చర్చల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, యూనియన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు, తాండ్ర అంజయ్య, నౌండ్ల బ్రహ్మచారి, ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రవెల్లి పురుషోత్తమరావు, కార్యదర్శి విజయ్‌పాల్‌రెడ్డి, కేశవరావు, రమేష్, సత్తయ్య, అర్జున్‌రావు, గోపాల్‌రావు, శ్రీనివాసరెడి, ప్రసాద్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

-ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లి రూరల్, జూన్11: పెద్దపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పెద్దపల్లి ఎంపీవో సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలంలోని రంగాపూర్, సబ్బితం గ్రామాల్లో పంచాయతీ అధికారులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను ఆయన పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు రవి, శ్రావణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

-రోడ్డు నిర్మిస్తున్నా ఏర్పాటు చేయని హెచ్చరిక బోర్డులు



తుర్కలమద్దికుంటకు వెళ్లే దారిలో రోడ్డుకు ఆనుకొని ఉన్న బావి

పెద్దపల్లి రూరల్, జూన్ 11: పెద్దపల్లి నుంచి జూలపల్లి మండలానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. పెద్దపల్లి నుంచి తుర్కలమద్దికుంట మీదుగా జూలపల్లి మండలానికి డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇరువైపులా పంటపొలాలు ఉండటంతో వాటికి సాగు చేసే బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో రోడ్డుకు ఆనుకొని ఉన్న బావుల్లో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌లు బావులు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

-ఏవో అలివేణి

పెద్దపల్లి రూరల్, జూన్ 11: రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి అలివేణి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకల్వల గ్రామంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణదారులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, ప్రతి రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దుకాణంలోని స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని వ్యవసాయాధికారిణి హెచ్చరించారు.

పెద్దమ్మతల్లి బోనాలు ప్రారంభం



బోనాలతో తరలుతున్న ముదిరాజ్ కుల పెద్దలు

ఓదెల, జూన్ 11: మండలంలోని నాంసానిపల్లిలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాల వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా పోచమ్మ తల్లికి మంగళవారం కుల పెద్దలు బోనాలను సమర్పించారు. బుధవారం గ్రామం నుంచి ఇంటికో బోనం చొప్పున తరలివెళ్లి గ్రామ పొలిమేరలో ఉన్న పెద్దమ్మకు బోనాలను సమర్పిస్తారు. ముంజాల వరుణ్ పెద్దమ్మ ఆలయానికి ఫ్యాన్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వీరవేణి రాజు, ఉపాధ్యాక్షుడు కందుల రాజు, వీర వేణి పైడయ్య, మాజీ ఉప సర్పంచ్ వీరవేణి రమేష్, నేదురి రాజు, నూనె రమేష్, మల్లేష్, సంజీవ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జూన్11: మోడల్ స్కూళ్ళ ఫలితాల్లో గోదావరిఖని గాంధీనగర్‌లోని గాంధీ పార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రామగుండంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో తొలి మూడు స్థానాలతో పాటు అత్యధిక సీట్లు కైవసం చేసుకున్నారు. టి.లిల్లీ 86 మార్కులతో ప్రథమస్థానం, కె.రాహుల్ 84 మార్కులు(ద్వితీయ), టి.లాస్య77 మార్కులు (తృతీయ) స్థానం సాధించారు. పాఠశాల నుంచి మొత్తం 21 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. విద్యార్థులను ఎంఈవో ఎ.రాజయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఇజ్రాయిల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు చెరుకూరి స్వరూప్ చంద్ అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుడు రాజేశంకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజేశం

కళ్యాణ్‌నగర్, జూన్ 11: తెలంగాణ ఉద్యమకారుడు గోదావరిఖనికి చెందిన దావనపల్లి రాజేశం ఆదివారం చాకలి ఐలమ్మ జాతీయ అవార్డును అందుకున్నాడు. మహారాష్ట్రలోని పూణెలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. రాజేశంకు అవార్డు రావడం పట్ల పలువురు అభినందించారు.



వయోపరిమితి పెంపు ఏఐటీయూసీ కృషి ఫలితమే..

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 11: ఏఐటీయూసీ కృషి ఫలితంగానే సింగరేణి డిపెండెంట్ల వయోపరిమితిని పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్టు యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, సెక్రెటరీ రాజారత్నంలు ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ శాసనసభ్యుడు, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు అసెంబ్లీ సమావేశాల్లో డిపెండెంట్ల వయోపరిమితిని పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారని, యూనియన్ పక్షాన పలుమార్లు యాజమాన్యంను సైతం కోరినట్టు తెలిపారు. యూనియన్ చొరవ కారణంగా డిపెండెంట్‌ల వయస్సున 35 నుంచి 40ఏళ్లకు పెంచుతూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడం అభినందనీయమని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు డిపెండెంట్‌ల వయస్సు పెంపు

అసెంబ్లీ ఎన్నికలు, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ యూనియన్‌లు కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు డిపెండెంట్ ఉద్యోగార్థుల వయస్సును 35నుంచి 40ఏళ్ళకు పెంచినట్టు ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు గడ్డం తిరుపతి పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ-1 సైటాఫీస్ ఆవరణలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. యూనియన్ విజ్ఞప్తి మేరకు వయోపరిమితి పెంచుతూ సర్క్యులర్ జారీ చేసినందుకు ఐఎన్‌టీయూసీ పక్షాన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు గడ్డం తిరుపతి పేర్కొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న అధికారులకు సన్మానం



ఎలీషాను సన్మానిస్తున్న కార్మికులు



అధికారులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 11: ఆర్జీ-3 ఏరియా ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ జీఎం (ఈఅండ్‌ఎం)గా పదోన్నతిపై వెళ్తున్న ఎలీషాను మంగళవారం ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్ కార్మికులు ఘనంగా సన్మానించారు. బేస్‌వర్క్‌షాప్ ఇంచార్జిగా, ప్రాజెక్టు ఇంజనీర్‌గా ఆయన చేసిన సేవలను కార్మికులు గుర్తు చేసుకున్నారు. నైపుణ్యంగల అధికారిగా సింగరేణిలో ఎలీషా గుర్తింపు పొందినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టుఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, ఏఈఈ రఘుకుమార్, హెచ్‌వోడీ సత్యనారాయణ, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధలు రమేష్, శ్రీనివాస్, నాయకులు జక్కుల దామోదర్‌రావు, వెంకటేశ్వర్లు, రవీందర్, కిషన్‌రెడ్డిలతో పాటు బేస్‌వర్క్‌షాప్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్జీ-3లో..

రామగిరి, జూన్ 11: సింగరేణి ఆర్జీ-3 పరిధిలోని పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన పదోన్నతి పొందిన అధికారులకు మంగళవారం సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఏరియా ఈఅండ్‌ఎంగా పనిచేస్తూ జీఎం ఈఅండ్‌ఎం స్టోర్స్ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న ఏలీషాను, డీవైపీఎంగా పనిచేస్తూ పర్సనల్ మేనేజర్ పదోన్నతి పొందిన కావూరి మారుతీలను జీఎం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడుశ్రీనివాస్, డైరెక్టర్స్ గంటవెంకటరమణరెడ్డి, గడ్డంశ్రావణ్ కుమార్, టీవీ సురేష్‌బాబు, తీగల శ్రీధర్, సునీల్, సుధాకర్, రమ్యరెడ్డి, సుధా, పాల్గొన్నారు.